సాక్షి విశాఖపట్నం

ఆదివారం, 6, ఆగస్టు, 2023

న్యూస్‌రీల్

ఆక్వా స్పోర్ట్స్ పనుల పరిశీలన



ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం రాత్రి బీచ్‌రోడ్డులో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్వయంగా ఈత కొలనులోకి దిగి పనులు పర్యవేక్షించారు. ఈత కొలనులో విద్యుత్ దీపాలు, ఫ్లోరింగ్, పాలిష్ పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడతున్న ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ ముకేష్ లాల్

మహారాణిపేట: నగరంలో ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ ముఖేష్ లాల్ తెలిపారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణపై శనివారం కలెక్టర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నగరంలో మొత్తం 5 పరీక్ష కేంద్రాల్లో 1,869 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. శ్రీనివాసమూర్తి, అండర్ సెక్రటరీ ఆర్కే దీక్షిత్, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖలీగల్: విశాఖలో వచ్చే నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయ స్థానం కాన్ఫరెన్స్ హాలులో కోఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని కోర్టుల్లో అన్ని రకాల కేసులు పెద్ద సంఖ్యలో రాజీ చేయాలని సూచించారు. బెయిల్ మంజూరులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ, బార్ కౌన్సిల్ అధ్యక్షురాలు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు కృష్ణ మోహన్, బైపా అరుణ్ కుమార్, కె.రామ జోగేశ్వరరావు, నరసింగరావు, జిల్లా పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అలలపై.. కలల విహారం

విశాఖ ప్రజలకు.. అంతర్జాతీయ విహారానికి ఆసక్తి చూపే పర్యాటకులకు క్రూయిజ్ సిద్ధమవుతోంది. ఈ ఏడాది అక్టోబర్ నాటి కల్లా అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి రూ.72.26 కోట్లతో విశాఖపట్నం పోర్టు చురుగ్గా పనులు నిర్వహిస్తోంది. పోర్టులోని గ్రీన్ చానల్ బెర్త్‌లో సముద్ర విహార కేంద్రం దాదాపు సిద్ధమైంది. ఏపీ తీరంలోనే కాదు.. ఈశాన్య తీరంలో ఎక్కడా ఈ తరహా టెర్మినల్స్ లేని నేపథ్యంలో ఇది పూర్తయితే.. పశ్చిమ బెంగాల్ నుంచి ఏపీ వరకు తీరప్రాంతంలో తొలి క్రూయిజ్ టెర్మినల్ ఇదే అవుతుంది.



సిద్ధమవుతున్న క్రూయిజ్ టెర్మినల్ భవనం

- విశాఖ నుంచి సముద్రయానానికి వడివడిగా అడుగులు
- ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తికానున్న క్రూయిజ్ టెర్మినల్ పనులు
- రూ.72.26 కోట్లతో చురుగ్గా సాగుతున్న బెర్త్, టెర్మినల్ నిర్మాణాలు
- పూర్తయిన వెంటనే సర్వీసులు నడిపేందుకు రెండు సంస్థల ఆసక్తి

సాక్షి, విశాఖపట్నం : దేశంలో ఇప్పటికే ముంబయి, కొచ్చి, చెన్నై, మంగుళూర్ పోర్టుల్లో క్రూయిజ్ టెర్మినల్స్ ఏర్పాటయ్యాయి. విశాఖలోనూ అదే రీతిలో అభివృద్ధి చేసేందుకు విశాఖ పోర్టు అథారిటీ అడుగులు వేసింది. రూ.72.26 కోట్లతో క్రూయిజ్ బెర్త్, టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇప్పటికే క్రూయిజ్ బెర్త్ పనులు 90 శాతం, టెర్మినల్ బిల్డింగ్ పనులు 85 శాతం వరకు పూర్తయ్యాయి. గంటకు 200 కి.మీ. వేగంతో వీచే గాలులను సైతం తట్టుకునేలా షోర్ ప్రొటెక్షన్ వాల్ కూడా ఇందులో నిర్మిస్తున్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి.. ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ప్రారంభించాలని పోర్టు ట్రస్టు అధికారులు భావిస్తున్నారు. కాగా.. కాంట్రాక్టర్ నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయకపోవడంతో ఆరు నెలల ఆలస్యంగా క్రూయిజ్ అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

దేశ, విదేశీ పర్యాటకులకు అనుగుణంగా..

ప్రపంచ పర్యాటకులు క్రూయిజ్‌లో వచ్చి.. నగరంలో పర్యటించే విధంగా వివిధ ఏర్పాట్లు చేయనున్నారు. టెర్మినల్ నిర్మాణంలో అనేక సౌకర్యాలు కల్పించనున్నారు. రెగ్యులర్ బెర్త్ 180 మీటర్ల పొడవు కాగా.. 330 మీటర్ల భారీ పొడవైన క్రూయిజ్ బెర్త్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈ విశాలమైన బెర్త్‌ని రెండు విధాలుగా వినియోగించుకోనున్నారు. 15 మీటర్ల వెడల్పు, 9.50 మీటర్ల డ్రెడ్జ్‌డ్ డెప్త్ నిర్మిస్తున్నారు. దీనివల్ల క్రూయిజ్ రాని సమయంలో సరకు రవాణా చేసే కార్గో నౌకలను కూడా బెర్త్‌పైకి అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రూయిజ్‌లో వచ్చే ఇంటర్నేషనల్ టూరిస్టుల చెకింగ్ కోసం ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాలు, పర్యాటకులు సేదదీరేందుకు పర్యాటక భవన్ నిర్మిస్తున్నారు. 2 వేల చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు పరిపాలన భవనం, కరెన్సీ మార్పిడి కౌంటర్లు, గ్యాంగ్‌వే, రెస్టారెంట్, లాంజ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్స్, షాపింగ్ మాల్స్, రెస్ట్‌రూమ్స్, టూరిజం ఆపరేటర్ల కౌంటర్లు కూడా రానున్నాయి. గరిష్టంగా 2500 మంది పర్యాటకులు వచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు.



టెర్మినల్ బిల్డింగ్ లోపల జరుగుతున్న పనులు

స్థానికులకు ఉపాధి అవకాశాలు

క్రూయిజ్‌తో కేవలం పోర్టు అథారిటీ మాత్రమే కాదు.. విశాఖ నగరంలోనూ వేల మందికి ఉపాధి కలుగుతుంది. స్థానిక దుకాణాల్లో షాపింగ్‌తో పాటు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు, స్థానిక ఉత్పత్తుల కొనుగోళ్లు కూడా పెరగనున్నాయి. సందర్శనా స్థలాల్లో టూరిస్టులు పర్యటించడం వల్ల.. ఆదాయం కూడా పెరుగుతుంది.

సర్వీసులు నడిపేందుకు రెండు సంస్థల ఆసక్తి

గత ఏడాది వచ్చిన కార్డిలియా షిప్‌కు మంచి ఆదరణ దక్కింది. దాదాపు విశాఖ నుంచి 20 వేల మందికి పైగా ప్రయాణించారు. ఈ టెర్మినల్ పూర్తయిన వెంటనే.. శీతాకాలంలో సర్వీసులు ప్రారంభించేందుకు ఇప్పటికే రెండు సంస్థలు పోర్టు అధికారులతో సంప్రదింపులు జరిపాయి. గతంలో సర్వీసులు నడిపిన ఎంప్రెస్ సంస్థకు చెందిన కార్డిలియా మరోసారి నడిపేందుకు ఆసక్తి చూపిస్తోంది. దీంతో పాటు స్విట్జర్లాండ్ ప్రధాన కేంద్రంగా లండన్, వెనిస్, ఇటలీ సహా ప్రపంచ వ్యాప్తంగా సర్వీసులు నడిపిస్తున్న ఎంఎస్‌సీ క్రూయిజ్ సంస్థ కూడా ముందుకొచ్చింది. అక్టోబర్‌లో టెర్మినల్ అందుబాటులోకి వస్తే.. నవంబర్ లేదా డిసెంబర్ నుంచి రోజు విడిచి రోజు.. ప్రతి సంస్థ వారానికి మూడు రోజుల పాటు నడిపేందుకు అంగీకారం తెలిపినట్లు పోర్టు అధికారులు చెబుతున్నారు.

‘బేబి’లో అదనంగా మరో పాట

- విశాఖ ప్రేక్షకులు ఆదరిస్తే సినిమా హిట్టే
- చిత్ర దర్శకుడు సాయిరాజేష్



అవంతి కాలేజీలో బేబి యూనిట్ సభ్యులు

అల్లిపురం: బేబి సినిమాలో ఆదివారం నుంచి మరో పాట యాడ్ చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు సాయిరాజేష్ వెల్లడించారు. విశాఖ ప్రేక్షకులు ఆదరిస్తే ఆ సినిమా హిట్టేనన్నారు. నగరంలో శనివారం బేబి చిత్ర యూనిట్ సందడి చేసింది. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో విలేకరులతో ముచ్చటించింది. ఈ సందర్భంగా హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ చిత్రం విడుదలై మూడు వారాలు అవుతున్నా.. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో రన్ అవుతోందన్నారు. మంచి సినిమాలను వైజాగ్ ప్రేక్షకులు విజయవంతం చేస్తారన్నారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ తాను గీతంలో బీటెక్ చదివానన్నారు. బేబి సినిమా పట్ల ప్రేక్షకులు చూపుతున్న అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడితూ బేబి చిత్రం విజయవంతంలో మీడియా సహకారం మరువలేమన్నారు. తన జీవితంలో ఎప్పుడూ గుర్తుండి పోయే సినిమా బేబి అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సినిమాను బాగా ఆదరిస్తున్నారని.. జగదాంబ థియేటర్‌లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ఆడుతోందన్నారు. నిర్మాత ఎస్.కె.ఎన్ మాట్లాడుతూ రూ.90కోట్ల గ్రాస్‌తో బేబి చిత్రం విజయవంతంగా ఆడుతోందన్నారు. తాను విజయ దేవరకొండతో టాక్సీవాలా తర్వాత ఆనంద్‌తో బేబి తీశానని వివరించారు. అంతకుముందు అవంతి కాలేజీలో చిత్ర యూనిట్ విద్యార్థులతో కలిసి సందడి చేసింది.

ఎమోషనల్ క్రైం థ్రిల్లర్ ‘దయా’

హీరో జేడీ చక్రవర్తి



మద్దిలపాలెం: ఎమోషనల్ క్రైం థ్రిల్లర్‌గా ‘దయా’ వెబ్ సిరీస్ అందరినీ ఆకట్టుకుంటుందని హీరో జేడీ చక్రవర్తి అన్నారు. దయా వెబ్ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా శనివారం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయా వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీలోకి అరంగ్రేటం చేశానని చెప్పారు. ఈ సిరీస్‌లో తాను ఫ్రీజర్ వ్యాన్ డ్రైవర్‌గా వైవిధ్యమైన పాత్ర పోషించానని.. విధుల్లో ఎదుర్కొన్న ఓ సంఘటన ఇతివృత్తంగా కథ ఉంటుందన్నారు. ఈ సిరీస్‌లో ప్రతీ సన్నివేశం ఉత్కంఠగా ఉంటుందని.. యువ దర్శకుడు పవన్ సాధినేని ఎమోషన్స్‌తో ఆసక్తికరంగా సన్నివేశాలను చిత్రీకరించినట్లు చెప్పారు. ఈషా రెబ్బా, రమ్య నంబీషన్, విష్ణుప్రియ, కమల్ కామరాజ్ తదితరులు వెబ్‌సిరీస్‌లో నటించినట్లు చెప్పారు. కాగా.. జేడీ చక్రవర్తితో సెల్ఫీలు తీసుకోవడానికి యువత ఎగబడ్డారు. ఓ యువతి ఎటో వెళ్లిపోయింది మనసు అంటూ పాట పాడి.. ఆయనతో సెల్ఫీలు తీసుకుని ఎగిరి గంతులేసింది.

ఏయూ దూరవిద్య ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్– డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో 11 కోర్సులను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడానికి అనుమతిచ్చిందని దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఇంగ్లిష్, యూజీ విభాగంలో బి.ఎ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటిక్స్), బి.కాం కోర్సులు అందిస్తామన్నారు. దరఖాస్తులు, ప్రవేశాల వివరాల కోసం www.andhrauniversity.edu.in ను సందర్శించాలని సూచించారు. సెమిస్టర్ విధానంలో నిర్వహించే ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31వ తేదీ ఆఖరు. రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానంలో పీజీ, యూజీ కోర్సులు నిర్వహిస్తున్న తొలి విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని ఆయన వివరించారు. ప్రవేశాల ప్రక్రియ, తరగతుల నిర్వహణ, అసైన్‌మెంట్స్, పరీక్షలు, మూల్యాంకనం వంటి మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ నుంచైనా ఈ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు 0891 2844162, 2844164, 2754966లో సంప్రదించాలని సూచించారు.

విశాఖలో మరో 15 బీచ్‌ల అభివృద్ధి

కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎమ్మెల్సీ కల్యాణి

మహారాణిపేట: జిల్లాలోని సముద్ర తీరప్రాంతాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతం అభివృద్ధిపై శనివారం కలెక్టరేట్‌లో బీచ్ కమిటీతో సమావేశమయ్యారు. ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు హోటళ్ల యాజమాన్యాల సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 17 బీచ్‌లు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయని.. మరో 15 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు గుర్తించినట్లు వెల్లడించారు. పర్యాటకులకు వినోదం, బోటింగ్, సాహస జల క్రీడలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక ప్రజల సహకారంతో బీచ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. తద్వారా స్థానికులు జీవనోపాధి పొందుతారన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లు, మంచినీటి సదుపాయం, షెడ్లను ఏర్పాటు చేస్తే పర్యాటకులు మరింత ఆకర్షితులవుతారన్నారు. టూరిజం సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆధ్యాత్మిక టూరిజం, సాహస టూరిజం, బీచ్ టూరిజంలను అభివృద్ధి చేయాలన్నారు. బీచ్ టూరిజంలో ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు రెండు, మూడు ప్రాంతాల్లో ప్రైవేట్ బీచ్‌లను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. సమాచార కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అనువైన ప్రదేశాల్లో జలక్రీడలు ఏర్పాటు చేస్తే పర్యాటకులు మరింత ఆహ్లాదం పొందుతారన్నారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జిల్లా అటవీ శాఖ అధికారి అనంత్ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, వివిధ హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

9 నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు




సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ

దొండపర్తి: ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న శ్రీకాకుళం సర్కిల్ శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్‌కు, 11న విశాఖపట్నం సర్కిల్‌లో అనకాపల్లి డివిజన్, యలమంచిలి సబ్ డివిజన్‌కు సంబంధించి ఆయా కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అలాగే 18న విజయనగరం సర్కిల్‌లో పార్వతీపురం సబ్ డివిజన్‌కు, 22న రాజమండ్రి సర్కిల్‌లో జగ్గంపేట డివిజన్ ప్రత్తిపాడు సబ్ డివిజన్‌కు, 23న ఏలూరు సర్కిల్‌లో జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని కామవరపుకోట సబ్ డివిజన్‌కు సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. అలాగే సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గల సీజీఆర్‌ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ సదస్సుల్లో సీజీఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ రాయసం సురేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు.

అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తా..

- పార్టీ బలోపేతానికి శ్రమిస్తా
- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్



సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నాయకుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన అభ్యర్థుల గెలుపునకు శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలిపారు. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువుల పర్యవేక్షణలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వచ్చే ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ అందరినీ కలుపుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కష్టపడతానని తెలిపారు.

7 నుంచి ఇంద్రధనుష్

మహారాణిపేట : ఇంద్ర ధనుష్, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు శనివారం విడుదల చేశారు. ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఇంద్రధనుష్, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డ్రాపవుట్స్ పిల్లలను గుర్తించి వారికి వ్యాధి నిరోధక టీకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం మూడు విడతల్లో జరుగుతుందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్‌రాణి పాల్గొన్నారు.

మటన్ పెట్టి.. మద్యం తాగించి..

- భర్త హత్య ముందు పెద్ద కుట్రే పన్నిన భార్య
- మై వైఫ్.. మై లైఫ్ అంటూ అతనితో చెప్పించిన శివాని
- వైరల్‌గా మారిన వీడియో



రమేష్ మటన్ తింటుండగా అతని భార్య తీసిన వీడియోలోని దృశ్యం

ఎంవీపీకాలనీ: వన్‌టౌన్ స్టేషన్ కానిస్టేబుల్ రమేష్ హత్య కేసులో లభించిన వీడియో చూసిన పోలీసులు.. అతని భార్య తెలివితేటలకు షాక్ అయ్యారు. ప్రియుడు రామారావుతో కలిసి శివాని మంగళవారం రాత్రి రమేష్‌ను ఊపిరాడకుండా చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. రమేష్ హత్యకు ముందు ప్రియుడితో కలిసి ఆమె పెద్ద కుట్రే పన్నింది. తన మీద అనుమానం రాకుండా భర్తతో ప్రేమగా ఉన్నట్టు ఆమె వీడియో రికార్డు చేసింది. మంగళవారం రాత్రి భర్తకి మటన్ వండి పెట్టి.. మద్యం తాగించింది. నా భార్య చాలా మంచిది.. ధైర్యవంతురాలు, మై వైఫ్.. మై లైఫ్ అంటూ అతనితో చెప్పించింది. ఆపై మద్యం మత్తులో జోగుతున్న భర్తను మంచంపై పడుకోబెట్టింది. ఈ దృశ్యాలు వైరల్‌గా మారాయి. హత్య నేరం తనపైకి రాకుండా ఉండేందుకే.. తాను మంచిదానినంటూ భర్తతో చెప్పించే ప్రయత్నంగా ఈ వీడియో తీసినట్లు పోలీసుల ఎదుట ఆమె అంగీకరించింది. దీంతో ఆమె నేరపూరిత వైఖరి పట్ల అంతా అవాక్కవుతున్నారు. కాగా.. తన పెద్దమ్మ కూతురు పైడమ్మ ద్వారానే టాక్సీ డ్రైవర్ రామారావు పరిచయం అయినట్లు పోలీసుల దర్యాప్తులో శివాని చెప్పినట్లు సమాచారం. పైడమ్మకు కూడా ఈ హత్య కేసులో సంబంధం ఉందని పోలీసులను శివాని నమ్మించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ కేసులో శివానీతో పాటు ప్రియుడు రామారావు, అతని స్నేహితుడు నీలాపై మాత్రమే ప్రస్తుతం కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు.

విమానాశ్రయ మూసివేత సమయాన్ని కుదించాలి

దొండపర్తి: విశాఖ విమానాశ్రయం రన్‌వేపై రీ సర్ఫేసింగ్ పనుల నిమిత్తం నవంబర్ 15 నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు రాత్రి సమయాల్లో విమాన రాకపోకలకు 11 గంటల ప్రతిపాదిత నిషేధ సమయాన్ని కుదించాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాకి లేఖ రాశారు. రన్‌వేపై రీసర్ఫేసింగ్ కోసం నేవీ రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు ప్రతి రోజు 11 గంటల పాటు విమాన రాకపోకలను నిషేధించడంతో 12 విమాన సర్వీసులు నిలిచిపోతాయని తెలిపారు. 5 నెలల పాటు రాత్రిపూట విమాన సర్వీసుల నిలిపివేత ప్రభావం విశాఖపై తీవ్రంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ఈ సమయంలో సింగపూర్ విమానం కూడా ఉందని, ఈ సర్వీసులన్నీ అంతర్జాతీయ ప్రయాణాలకు కనెక్టింగ్‌గా ఉంటాయని వివరించారు. విశాఖకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా మూసివేత వేళలు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5.30 వరకు మాత్రమే పరిమితం చేయాలన్నారు.